వేలాడుతున్న మృత్యు ఘంటికలు..!


పాతబస్తీలో సాలెగూడుల్లాంటి విద్యుత్ వైర్లు

- పాతబస్తీలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు
- అడ్డదిడ్డంగా ఉన్న వైర్లతో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు
- భయాందోళనలో స్థానికులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

చార్మినార్: పాతబస్తీలో హైటెన్షన్ విద్యుత్ తీగలు దడపుట్టిస్తున్నాయి. ఈ నెల 18న అర్ధరాత్రి పాత బస్తీ శివారులోని బండ్లగూడ క్రాస్ రోడ్డులో వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తగిన ఇద్దరు మృతి చెందిన ఘటన పాతబస్తీలో కలకలం రేపింది. పాతబస్తీ శివారులోని జల్‌పల్లి నుంచి పురానాపూల్‌కు భారీ వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా ఈ విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనతో పాతబస్తీలో అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల పరిస్థితులు తెరపైకి వచ్చాయి. ఎటుచూసినా సాలేగూళ్లలాంటి విద్యుత్ తీగలపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందున్న ఇనుప స్తంభాలకు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లు, సర్వీస్ వైర్లు శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేయకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ముఖ్యంగా ఇళ్లను ఆనుకుని వెళ్తున్న ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లు స్థానికులకు దినదిన గండంగా మారాయి.

కానరాని అధికారుల పర్యవేక్షణ..

బస్తీల్లో ఏర్పాటు చేసిన వీధి స్తంభాలకు ఉన్న వైర్లను పట్టించుకోవడంలో సంబంధిత సెక్షన్ విద్యుత్ సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు. టీఎస్ఎస్ పీడీసీఎల్ దక్షిణ మండలంలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్‌లున్నాయి. దక్షిణ మండలం సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) పరిధిలోని ఈ మూడు డివిజన్ల పరిధుల్లో మళ్లీ ముగ్గురు, ముగ్గురు ఏడీఈలు, సీబీడీ ఏడీఈలు, ఏఈలు విధి నిర్వహణలో ఉంటారు. వీరెవ్వరు తమ కార్యాలయాలను వదిలి క్షేత్రస్థాయి పరిశీలన చేయరనే ఆరోపణలున్నాయి. వీరి పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్, గాంధీనగర్, హమాలీబస్తీ, ఎస్టీ కాలనీ తదితర బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లతో ప్రమాదాలు ఎదురవుతున్నాయని సంబంధిత అధికారులకు వివరించగా.. కేవలం ఎల్టీ విద్యుత్ వైర్ల స్థానంలో బంచ్ కేబుల్ (బీసీ) వైర్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదాలు..

- 2011 డిసెంబర్ 3న వట్టెపల్లి ఫాతీమానగర్‌లో హైటెన్షన్ వైరు తెగి టెలిఫోన్ స్తంభం ద్వారా ఓ పాన్ డబ్బాకు విద్యుత్ సరఫరా కావడంతో అటుగా వెళ్తున్న ఇద్దరు చిన్నారులు డబ్బాను తాకగా విద్యుత్ షాక్‌కు గురై 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందారు.
- 2013 సెప్టెంబర్ 14న రాత్రి ఉప్పుగూడ అశోక్‌నగర్‌కు చెందిన సి.చరణ్‌నాయుడు అనే చిన్నారి ఇంటికి దగ్గర్లో నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా హైటెన్షన్ వైరు తెగి మీద పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.
- 2013లో గౌలిపురాలో రాత్రి 8గంటలకు ఓ వ్యక్తి విధుల నుంచి ఇంటికి వస్తుండగా తెగిపడిన హైటెన్షన్ వైరుపై కాలుపెట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- 2014లో గౌలిపురా అయోధ్యనగర్‌లో హైటెన్షన్ వైరు తెగి కింద పడడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో తృటిలో ప్రమాదం తప్పింది.
- 2018 జనవరిలో కబూతర్ ఖానాలోని చిన్న బజార్‌లో ఇంటర్ విద్యార్థి చింటూ వీధి స్తంభంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- 2018 ఫిబ్రవరిలో ఘాన్సీబజార్‌లో విద్యుత్ వైరు తెగి కిందపడడంతో ఓ యువకుడు గాయపడ్డాడు.
- 2025 జనవరిలో చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో, రాజేంద్రనగర్ పీఎస్ పరిధుల్లోని రెండు వేర్వేరు చోట్లలో యువకులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఇనుప వీధి స్తంభానికి విద్యుత్ సరఫరా జరగడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.
- ఈ నెల 13న ఆస్మాన్‌గడ్ డివిజన్ పరిధిలోని మూసారాంబాగ్‌లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఓ ఆర్టిజన్ కార్మికుడు మృత్యువాత పడ్డారు.
- ఇక ఈ నెల 18న అర్ధరాత్రి పాతబస్తీ శివారు ప్రాంతమైన బండ్లగూడ క్రాస్ రోడ్డులో వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తాకి ఇద్దరు మరణించారు. పాతబస్తీ పురానాపూల్‌కు భారీ వినాయక విగ్రహాన్ని జల్‌పల్లి నుంచి తరలిస్తుండగా ఈ విద్యుత్ ప్రమాదం సంభవించింది.

జీఎన్ఐటీఎస్‌లో విద్యార్థులకు ఓరియంటేషన్



కార్యక్రమంలో నటుడు తనికెళ్ల భరణి తదితరులు

గోల్కొండ: రాత్రి వేళల్లో ఎలక్ట్రానిక్ పరికరాలను పరిమితంగా వాడాలని ప్రముఖ నటుడు, కవి, నాటక రచయిత తనికెళ్ల భరణి తనికెళ్ల భరణి అన్నారు. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బి.టెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో చేసిన స్ఫూర్తిదాయక సంభాషణతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ అధ్యక్షుడు జీ. రాఘవ రెడ్డి, చైర్‌పర్సన్ శ్రీ విద్యారెడ్డి, రమేశ్ రెడ్డి, ప్రిన్సిపాల్, జీఎన్ఐటీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తున్న మార్వాడీలు'


పంకజ్ కుమార్ అగర్వాల్

చార్మినార్: కష్టించి వ్యాపారాలు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తున్న మార్వాడీలను గో బ్యాక్ అనడంలో అర్థం లేదని కుంభ మేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. మార్వాడీలు తెలంగాణ ప్రజలతో పూర్తిగా మమేకమైన కలిసి మెలిసి జీవిస్తున్నారన్నారు. ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్న మార్వాడీలు ఎవరికీ ఎలాంటి నష్టం కలుగచేయరన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఓరియంటేషన్‌లో ఉపేంద్ర పసుపతి, సోలోమన్ దేవ వరంలు, కె.కృష్ణారావు

అబిడ్స్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని క్లౌడ్ సర్వీసెస్ డెలివరి ఎట్ కిన్‌డ్రిల్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఉపేంద్ర పసుపతి, గ్లోబల్ ట్యాలెంట్ అక్విసిషన్ ఎట్ క్రిటికల్ రివర్ హెడ్ సీనియర్ డైరెక్టర్ సోలోమన్ దేవవరం అన్నారు. మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు జరిగిన ఓరియంటేషన్‌లో వారు పాల్గొని ప్రసంగించారు. కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు మాట్లాడుతూ..మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యతతో కూడి విద్యాబోధన అందించడంతో పాటు వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మీపతి రావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు జి బెనకాప్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ కె.అనురాధారెడ్డి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సచింద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తల్లిదండ్రుల ఆశీస్సులు ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో సాధన సాహితీ స్రవంతి, తిరుమల చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ సముద్రాల వేంకట రామానుజాచార్య స్వామికి కేవీ రాఘవాచారి స్మారక పురస్కారం, యువ ప్రవచనకర్త గంగిశెట్టి లక్ష్మీనారాయణకు డాక్టర్ కేవీ రమణాచారి స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి యువత విదేశాలకు వెళ్లి డాలర్లు సంపాదించాలనే ఆలోచనతో ఉన్నారే తప్పా దేశానికి సేవ చేయాలనే ఆసక్తి చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యువతలో స్ఫూర్తిని నింపడం కోసమే ప్రతి సంవత్సరం ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు పిల్లల మర్రి రాములు, విశ్రాంత ప్రధానాచర్యులు ప్రభాకర్‌శర్మ, సంస్కృత భారతి ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీనారాయణచారి, సాధన సాహితీ స్రవంతి అధ్యక్షులు నర్సింహచార్య తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఇళ్లను ఖాళీ చేయాలి: ఎమ్మెల్యే


నానల్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పురాతన ఇళ్లల్లో నివసిస్తున్న వారు వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకి, గోల్కొండ, నానల్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత వారం రోజులుగా నిరంతరం బస్తీల్లో పర్యటిస్తున్నానని వర్షపు నీరు ఆగి ఉన్న చోట్ల మాన్సూన్ స్పెషల్ టీంలను రంగంలోకి దింపి వరద నీటిని తొలగింపజేస్తున్నామన్నారు. అయితే నగరంలో భారీ వర్షాలకు పురాతన ఇళ్లు కూలి ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవిస్తుందన్నారు. పురాతన ఇళ్లల్లో నివసిస్తున్న వారు వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఆయన సూచించారు. తమతమ బస్తీలు, కాలనీల్లో విద్యుత్ స్తంబాలు, తీగలతో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రైవేటు కేబుల్స్ ఆపరేటర్లకు రెండు రోజుల్లో విద్యుత్ స్తంబాల నుంచి కేబుల్స్ తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూన్ ఫరాన్ తదితరులున్నారు.

బట్రాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి


కళాకారులతో భట్రాజ్ కుల సంఘాల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: బట్రాజ్ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు బుధవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో తెలంగాణ భట్రాజ్ సంఘం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బట్రాజ్ సాంస్కృతిక సమ్మేళనం, వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బట్రాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్‌రాజు మాట్లాడుతూ..ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో బట్రాజ్ కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనమంతా ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పూర్ణచంద్రరాజు, ఉపాధ్యక్షుడు ఎస్.నరసరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రాజ్, అధికార ప్రతినిధి గొల్లపల్లి సీతారామరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, సావిత్రి కూరపాటి రంగరాజు, కర్ణాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు


డీఈ శ్రీధర్‌తో సమావేశమైన గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

చార్మినార్: గణేష్ ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరాకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్ అన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కేంద్ర కమిటీ సభ్యులు రూప్ రాజ్, ప్యారసాని వెంకటేష్, చార్మినార్ అసెంబ్లీ కన్వీనర్ ముఖేష్ యాదవ్, కో కన్వీనర్ కునాల్ రావు సమన్వయ సభ్యుడు అనిల్ బజాజ్, నర్సింగ్ యాదవ్ తదితరులు బుధవారం ఆయనతో సమావేశం అయ్యారు. గణేష్ ఉత్సవాలు నేపథ్యంలో ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు డీఈని కోరారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ..గణేష్ మండపాల ఏర్పాటుతో పాటు నిమజ్జనోత్సవాల సందర్భంగా నిర్వాహకులు ఎప్పటికప్పుడు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఏడీఈ మహమ్మద్ మక్సూద్, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్: వినాయక ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేటట్లు అందరూ నిరంతరం పని చేయాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా అన్నారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం పురానీహవేలీలోని దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. పోలీసు, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక శాఖ, ఆర్టీఏ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అదనపు బలగాలతో పాతబస్తీలో బందోబస్తు నిర్వహించనున్నామన్నారు. మండపాల వద్ద ఉత్సవాల నిర్వాహకులు విధి నిర్వహణలోని తమ పోలీసు సిబ్బందితో పూర్తిగా సహకరించాలన్నారు. జోనల్ కమిషనర్ సోలీపేట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మేరకు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేయాలి



గౌలిపురా: అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఐక్య వేదిక ప్రతినిధులతో కలిసి పురానీహవేలిలోని సర్కిల్-2 పౌర సరఫరాల శాఖ అధికారి సురేందర్‌ని కలిసి కొత్త రేషన్ కార్డులు, పాత రేషన్ కార్డులో పేర్లు నమోదు దరఖాస్తు పత్రాలను అందజేసి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. దీనిపై అధికారి సానుకూలంగా స్పందించి వెంటనే పత్రాలను పరిశీలించి అర్హులను గుర్తించి రేషన్ కార్డులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో హర్షత్, సంగ్రామ్, జానకీరామ్, గాలి పూలే రాజు, చంద్రమోహన్, ప్రకాశ్, రమేశ్, ప్రవీణ్ వాల్మీకి తదితరులు ఉన్నారు.

రెండు బైకులు ఢీకొని యువకుడి మృతి

సంతోష్‌నగర్: రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా..ఇద్దరు తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన బుధవారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఇస్మాయిల్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం ఫజల్ ఈ నెల 19న రాత్రి ఇద్దరు స్నేహితులతో కలిసి యాక్టివా స్కూటర్‌పై పిసల్‌బండ నుంచి ధాతునగర్ వైపు వెళుతున్నాడు. అదే సయమంలో ఉప్పుగూడకు చెందిన బొడిగల సంజయ్ కుమార్ బైకుపై వీరికి ఎదురు వచ్చి వేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన మహ్మద్ ఇబ్రహీం ఫజల్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించగా..వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గాయాలకు గురైన మిగతా ఇద్దరిని చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఫజల్ మామ మహ్మద్ గౌసుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభినందనలు



చాంద్రాయణగుట్ట: వడోదెర ఐఐటీ క్యాంపస్‌లో సీటు సాధించిన నాయక్ బూడోకాన్ కరాటే అకాడమీ విద్యార్థి నడికుడ గౌతమ్ రాజ్‌కు బుధవారం సన్మానించారు. ఛత్రినాక శివగంగానగర్‌లోని లక్ష్మణేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ చైర్మన్ మారెడ్డి దామోదర్ రెడ్డి, కరాటే అకాడమీ అధ్యక్షుడు మాస్టర్ గణేష్ నాయక్‌లు విద్యార్థిని శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ గౌడ్, నాగరాజు, కె.రవీందర్, ఎస్.హేమంత్, వి.సుమన్ నాయక్, రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ హరిచందన

చార్మినార్/దూద్‌బౌలి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ప్రభుత్వ అధికారులకు సూచించారు. పురానాపూల్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం కలెక్టర్ హరిచందన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలు సరిగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలలోని మందుల సరఫరా, రోగులకు వివిధ పరీక్షలు సరిగ్గా జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా ఏమైనా సమస్యలు ఉంటే తనకు నేరుగా తెలియజేయాలని ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ బుష్రా ఫాతిమాకు సూచించారు. అనంతరం బహదూర్‌పురా మండల కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ తదితర పథకాలు ఎలా జరుగుతున్నాయో అని తహసీల్దార్ బాల శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా కృషి


అధునాతన వైద్య పరికరాలను పరిశీలిస్తున్న డాక్టర్ నూరి దత్తాత్రేయ, డైరెక్టర్ శ్రీనివాసులు

నాంపల్లి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు (అమెరికా), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య విభాగం సలహాదారు డాక్టర్ నూరి దత్తాత్రేయ తెలిపారు. రాష్ట్ర వైద్య విభాగం సలహాదారుగా నియమితులైన ఆయన బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎన్‌జే ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులుతో కలిసి ఆయన ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఏర్పాట్లు, వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మంచి సిబ్బంది, వైద్యులు, రేడియేషన్, అధునాతన యంత్రాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. పీడియాట్రిక్ కేన్సర్ విభాగంలో బెడ్ల సంఖ్యను పెంచాల్సి ఉందని వైద్యాధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పీడియాట్రిక్స్ విభాగంలో 120 బెడ్స్ మాత్రమే ఉన్నాయని, వాటిని ఐదు వందల బెడ్లుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, కేన్సర్ రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు శక్తి వంచన లేకుండా పాటుపడుతానని తెలిపారు.

బేగంబజార్‌లో డ్రైనేజీ, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి


డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్‌తో సమావేశమైన కోళ్ల ప్రదీప్‌రాజ్ తదితరులు

అబిడ్స్: బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్ రాజ్ డిమాండ్ చేశారు. వినాయక చవితి ఉత్సవాలకు ఆరు రోజుల సమయం ఉన్నప్పటికీ మరమ్మతులు ఎప్పుడు చేపడుతారని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్‌కు కోళ్ల ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రోడ్లపై కంకర్లు తేలి గుంతలుగా మారినా కనీసం ప్యాచ్‌వర్క్‌లు కూడా చేయడం లేదన్నారు. ఉమాప్రకాష్ మాట్లాడుతూ..వేగవంతంగా పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమన్‌లాల్ యాదవ్, మహ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సహకరించాలి


ర్యాలీలో కార్పొరేటర్ సమీనాబేగం, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు

యాకుత్‌పురా: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా బస్తీవాసులు సహకరించాలని తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం సూచించారు. నషేమన్ నగర్, తలాబ్‌కట్టా, భవానీనగర్, చాచాగ్యారేజ్, సిద్దిఖీనగర్ ప్రాంతాల్లో బుధవారం పారిశుద్ధ్య సమస్యలను అరికట్టేందుకు ప్రత్యేకంగా రూపొందించిన బ్యానర్‌ను ప్రదర్శిస్తూ జీహెచ్ఎంసీ కార్మికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజలు తమ ఇంట్లోని చెత్తను రోడ్లపై, నాలాలు, ఖాళీ స్థలాల్లో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ఆరోగ్య సమస్యలు వస్తాయని స్థానికులకు వివరించారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి పాశం రాజేందర్‌యాదవ్

లంగర్‌హౌస్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ప్రజలకు చేసిన సేవలు మరవలేమని టీపీసీసీ కార్యదర్శి పాశం రాజేందర్ యాదవ్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి పురస్కరించుకొని రాజేందర్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు ప్రాంతాల్లో జరిగిన జయంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. నాయకులు నర్సింగ్ రావు, సుభద్రారెడ్డి, అరవింద్ గౌడ్ ఉన్నారు.

కామెంగ్ కింగ్స్ జెర్సీ ఆవిష్కరించిన మోహిత్



సాక్షి, సిటీబ్యూరో: టెకిటాగర్ అరుణాచల్ టీ20 చాంపియన్‌షిప్‌లో భాగమైన కామెంగ్ కింగ్స్ జట్టు జెర్సీ, లోగోను రైజింగ్ స్టార్ టీఎస్ఆర్ మోహిత్ ఆవిష్కరించారు. బీసీసీఐ మద్దతు అందిస్తున్న ఈ టీ20 చాంపియన్‌షిప్‌లో కామెంగ్ కింగ్స్ సహా ఎనిమిది జట్లు పోటీ పడుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కామెంగ్ కింగ్స్ కెప్టెన్‌గా యువ స్పిన్ సంచలనం టీఎస్ఆర్ మోహిత్ జట్టును పరిచయం చేశారు. ఈ సందర్భంగా మోహిత్ మాట్లాడుతూ..సిక్కింపై సంచలనాత్మక 9 వికెట్ల తొలి ప్రదర్శన క్రికెట్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచిందని తెలిపారు. కామెంగ్ కింగ్స్‌కు మద్దతు ఇవ్వడం అనేది స్పాన్సర్‌షిప్ కంటే ఎక్కువ అని ఫ్రాంచైజ్ ప్రధాన స్పాన్సర్ అరవింద్ తడకమల్ల పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు


పోతరాజుల నృత్యాలు, బోనాలతో మహిళలు

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ స్టేట్ ఫోరం అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ సెక్రెటరి ఎం.భాస్కర్‌ల ఆధ్వర్యంలో విద్యాశాఖ ఉద్యోగులు, అధికారులు అమ్మవారికి పూజలు చేసి బోనాల ఉత్సవాలు నిర్వహించారు. టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్, టీజీఓ అధ్యక్షుడు ఇ.శ్రీనివాస్, కేంద్ర రాష్ట్ర యూనియన్ల నాయకులు సత్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, బాల్‌రాజ్, కృష్ణ యాదవ్‌తో పాటు గ్రేటర్ పరిధిలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గీతా, శ్రీధర్, సరోజినిదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పైకప్పు.. తప్పిన ముప్పు



నాంపల్లి: ఇటీవల కురిసిన వర్షానికి బజార్‌ఘాట్ జూనియర్ కళాశాల పైకప్పు పెచ్చులు ఊడిపోయాయి. రాత్రి సమయంలో కూలడంతో ప్రాణాపాయం తప్పింది. ఉదయాన్నే కళాశాలకు వచ్చిన సిబ్బంది అక్కడికి వచ్చి చూడగా భవనంలోని గదులు, వరండా పైకప్పు కూలిన విషయం తెలిసింది. దీంతో ఆ భవనానికి అధ్యాపకులు లోనికి ఎవరూ వెళ్లకుండా తాళం వేశారు. పైకప్పు పెచ్చులూడిన భవనానికి తాళం వేయడంతో మరో భవనంలోని గదుల్లోకి మార్చారు. స్థలాభావం కారణంగా విద్యార్థులకు షిఫ్టుల పద్ధతిలో చదువులు చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.